సాక్షి
నారాయణపేట
బుధవారం । 6 । మార్చి । 2024



'ప్రసాద్' భవనం రెడీ

అలంపూర్‌లో నిర్మించిన ప్రసాద్ స్కీం భవనం ప్రారంభానికి సిద్ధమైంది.

వివరాలు 8లో ▸



నల్లమలలో శివనామస్మరణ

శ్రీశైలం వెళ్తున్న భక్తుల శివనామస్మరణతో నల్లమల అటవీ ప్రాంతం మార్మోగుతోంది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.7 /18.6

రోజురోజుకు ఎండ తీవ్రత అధికమవుతుంది. ఆకాశం నిర్మానుష్యంగా ఉండటంతో పాటు అప్పుడప్పుడు వేడి గాలులు వీస్తాయి.

'పొత్తు'తో సమరం..

లోక్‌సభ ఎన్నికల వేళ బీఆర్‌ఎస్, బీఎస్పీ మధ్య కుదిరిన మైత్రి

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బరిలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్?
- పొత్తులతో ఆసక్తికరంగా మారిన రాజకీయం
- మహబూబ్‌నగర్‌లో సిట్టింగ్ ఎంపీకే అవకాశం



మన్నె శ్రీనివాస్‌రెడ్డి



ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



సాక్షి, నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. బీఆర్‌ఎస్, బీఎస్పీ మధ్య పొత్తు కుదిరి వచ్చే ఎన్నికల్లో ఇరుపార్టీలు కలిసి పనిచేయనున్నాయి. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి వేదికగా.. తాను లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. నాలుగు రోజుల వ్యవధిలోనే బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలవడం, అంతలోనే ఇరుపార్టీల మధ్య పొత్తు ఒప్పందం వంటి పరిణామాలు అనూహ్యంగా చోటుచేసుకున్నాయి. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీఎస్పీ కలిసి పోటీ చేయనున్నట్లు గులాబీ బాస్ స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో ఇప్పటికే బీజేపీ అభ్యర్థిని ఖరారు చేయగా.. కాంగ్రెస్ సైతం అభ్యర్థి ఎంపిక ఓ కొలిక్కి వచ్చింది. కాగా.. బీఆర్‌ఎస్ పొత్తు వ్యూహంతో ముందుకు సాగుతుండటం సర్వత్రా ఆసక్తి రేపుతోంది. మరోవైపు మహబూబ్‌నగర్ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికే అవకాశం ఇచ్చింది.

ఎంపీ రాములు పార్టీ మారడంతో అంతర్మథనం..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సిట్టింగ్ ఎంపీ రాములు తన తనయుడు, కల్వకుర్తి జెడ్పీటీసీ భరత్‌ప్రసాద్‌తో కలసి కాషాయ కండువా కప్పుకోవడంతో బీఆర్‌ఎస్‌కు షాక్ తగిలింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీలో కొన్నిరోజులగా అనిశ్చితి నెలకొంది. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా భరత్‌ప్రసాద్‌ను ఖరారు చేయగా.. కాంగ్రెస్ తమ అభ్యర్థిగా మల్లురవిని ఖరారు చేసే అవకాశం ఉంది. అయితే బీఆర్‌ఎస్ నుంచి ఎవరిని బరిలో దింపాలన్నదానిపై ఇప్పటి వరకు సందిగ్ధం నెలకొంది. ఈ క్రమంలో అనూహ్య పరిణామాల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ నుంచి తాను బరిలో ఉంటానని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రకటించడం, అంతలోనే బీఎస్పీ, బీఆర్ఎస్ మధ్య పొత్తు ఒప్పందం కుదరడంతో ఒక్కసారిగా రాజకీయ సమరం మారిపోయింది. ఎస్సీ రిజర్వ్‌డ్‌గా ఉన్న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ రెండు ఎమ్మెల్యే స్థానాలను మాత్రమే గెలుచుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలను రచిస్తోంది. ఇందులో భాగంగానే బీఎస్పీతో పొత్తుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అలంపూర్‌కు చెందిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ (రేపల్లె శివ ప్రవీణ్‌కుమార్)ను రంగంలోకి దింపి ఆయన గెలుపునకు కృషిచేయాలని నిర్ణయం తీసుకుంది.

ఆశావహులు అలంపూర్‌వాసులే..

బీఆర్‌ఎస్, బీఎస్పీ పొత్తు ఫలితంగా నాగర్‌కర్నూల్‌లో పోటీచేయనున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు కాంగ్రెస్‌లో ఈ స్థానం నుంచి టికెట్ ఆశిస్తున్న ముగ్గురు నేతలు సైతం అలంపూర్ నియోజకవర్గానికి చెందిన వారే కావడం గమనార్హం. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం, అలంపూర్ నియోజకవర్గంలోని కొండేరుకి చెందిన మాజీ ఎంపీ మందా జగన్నాథం సైతం నాగర్‌కర్నూల్ నుంచి కాంగ్రెస్ ఎంపీ సీటును ఆశిస్తున్నారు.

రసకందాయంలో ఎమ్మెల్సీ ఎన్నికలు

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. బీఆర్‌ఎస్ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేరును ప్రకటించగా.. కాంగ్రెస్ అభ్యర్థిగా మన్నె జీవన్‌రెడ్డిని బరిలో దింపనుంది. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి రాజీనామా నేపథ్యంలో మార్చి 28న ఎమ్మెల్సీ స్థానానికి ఉపఎన్నిక జరుగనుంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా ఈనెల 11 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించనున్నారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గంలో జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లతో కలిపి మొత్తం 1,450 వరకు ఓటర్లు ఉండగా, వీరిలో ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు చెందిన వారే అధికంగా ఉన్నాయి. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడం, మారిన పరిస్థితుల నేపథ్యంలో క్రాస్ ఓటింగ్ చోటుచేసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎవరికి అనుకూలంగా మారుతుందన్నది ఉత్కంఠ రేపుతోంది.



ఆల వెంకటేశ్వర్‌రెడి



మన్నె జీవన్‌రెడ్డి

అభ్యర్థుల ఖరారుతో రాజుకున్న 'వేఢీ'

లోక్‌సభ అభ్యర్థుల ఖరారు కొలిక్కి వస్తుండడంతో అభ్యర్థుల రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మహబూబ్‌నగర్ స్థానంలో బీజేపీ అభ్యర్థి విషయంలో మాత్రం సందిగ్ధం కొనసాగుతుంది. కాంగ్రెస్ తరఫున చల్లా వంశీచంద్‌రెడ్డి పోటీలో ఉంటున్నారని పది రోజుల క్రితమే సీఎం రేవంత్‌రెడ్డి కోస్గి వేదికగా ప్రకటించారు. ఎన్నికల శంఖారావంలో భాగంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ కళాశాలలో భారీ బహిరంగసభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. బీఆర్‌ఎస్ తరఫున సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇచ్చారు. మంగళవారం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నాయకులతో చర్చించిన అధినేత కేసీఆర్.. శ్రీనివాస్‌రెడ్డి పేరుకు ఖరారు చేశారు.

కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం

నేడు పాలమూరులో ప్రజాదీవెన సభకు సర్వం సిద్ధం

- హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 13 రోజుల వ్యవధిలోనే ఉమ్మడి జిల్లాలో రెండో పర్యటన
- లక్ష మంది జన సమీకరణకు నేతల కార్యాచరణ





ఎంవీఎస్ కళాశాల మైదానంలో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

స్టేషన్ మహబూబ్‌నగర్/ మహబూబ్‌నగర్ క్రైం: రానున్న పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమవుతోంది. ప్రతి పార్లమెంట్ పరిధిలో ఒక బహిరంగసభ నిర్వహించేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా పాలమూరు నుంచి కాంగ్రెస్ ఎన్నికల శంఖారావాన్ని పూరించనుంది. ఇటీవల కోస్గి సభలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డిని ప్రకటించడం, రానున్న ఎన్నికల దృష్ట్యా సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా ఉండడంతో ఈ సభ మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అంతేగాక వంశీచంద్‌రెడ్డి చేపట్టిన న్యాయయాత్ర ముగింపు సందర్భంగా బహిరంగసభను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం 'పాలమూరు ప్రజాదీవెన సభ'కు సర్వం సిద్ధం చేశారు. సీఎం పాల్గొనే ప్రత్యేక వేదిక, కళాకారుల వేదికతో పాటు లక్షమంది ప్రజలు కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి పాలమూరుకు తొలిసారి వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు, నాయకులు భారీ సంఖ్యలో జన సమీకరణ కోసం ప్రత్యేక దృష్టి సారించారు.



సీఎం సభకు సిద్ధమవుతున్న వేదిక

మెయిన్ స్టేడియంలో హెలీప్యాడ్

జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. సీఎం ముందుగా హెలీకాప్టర్ ద్వారా స్టేడియానికి చేరుకొని అక్కడి నుంచి కాన్వాయ్‌లో సాయంత్రం సభాస్థలికి చేరుకుంటారు. గత నెల 21న కోస్గిలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, బహిరంగ సభలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి కేవలం 13 రోజుల్లోనే ఉమ్మడి జిల్లాలో రెండోసారి పర్యటిస్తుండటం విశేషం. ఈ సభలో సీఎంతోపాటు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు పాల్గొంటున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

ఎంవీఎస్ మైదానంలో సీఎం రేవంత్‌రెడ్డి సభ ఏర్పాట్లను సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. ముందుగా మెయిన్ స్టేడియంలో హెలీప్యాడ్, అనంతరం ఎంవీఎస్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో చర్చించారు. వారి వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ తదితరులున్నారు.

1,300 మంది పోలీసులతో బందోబస్తు

ప్రజాదీవెన సభకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్న క్రమంలో జిల్లా పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. సభా స్థలంతోపాటు హెలీప్యాడ్ వద్ద 1,300 మందితో భద్రత కల్పిస్తున్నారు. మొదట సీఎం హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్ ద్వారా జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియం గ్రౌండ్‌లో దిగనున్నారు. అక్కడి నుంచి రోడ్ మార్గంలో ఎంవీఎస్ మైదానం చేరుకుంటారు. ఈ క్రమంలో జిల్లా స్టేడియం నుంచి ఎంవీఎస్ వరకు రోడ్డు మార్గంలో ప్రధాన చౌరస్తా, రోడ్డుకు ఇరువైపులా 250 మందితో ప్రత్యేక భద్రత కల్పించారు. సభ ముగిసిన తర్వాత బైపాస్ మీదుగా అప్పన్నపల్లి ఆ తర్వాత జడ్చర్ల నుంచి హైదరాబాద్‌కు రోడ్డు మార్గంలో వెళ్తారు. సీఎం భద్రతా ఏర్పాట్లను ఇద్దరు ఏఎస్పీలు, 12 మంది డీఎస్పీలు, 33 మంది సీఐలు, 60 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు కలిపి 1,193 మంది విధుల్లో ఉంటారు. బందోబస్తును ఎస్పీ హర్షవర్ధన్‌తోపాటు ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించనున్నారు.

రెండోరోజు ఒక నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న బిజినేపల్లి ఎంపీటీసీ సభ్యుడు మంగి విజయ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లాలోని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మంగళవారం రెండోరోజు ఒక నామినేషన్ దాఖలైంది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి ఎంపీటీసీ సభ్యుడు మంగి విజయ్ తన నామినేషన్‌ను కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కలెక్టర్ రవినాయక్‌కు అందజేశారు. కాగా, ఈ నెల 11 వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉంది. ఇదిలా మంగి విజయ్ మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యుల హక్కుల సాధన కోసమే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బరిలో నిలబడుతున్నట్లు ఎంపీటీసీల సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, బిజినేపల్లి ఎంపీటీసీ సభ్యుడు మంగి విజయ్ పేర్కొన్నారు. తమకు ఎలాంటి విధులు, నిధులు లేకుండా కేవలం ఉత్సవ విగ్రహాలుగా మిగిలి పోయామన్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీటీసీల ఆత్మగౌరవం వినబడేలా ఎంపీటీసీల సంఘం నుంచి బరిలో నిలిచానని, మన ఓటును మనమే వేసుకుని చట్టసభల్లో తమ హక్కుల సాధన కోసం గళం విప్పుదామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, బిజినేపల్లి ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, వైస్ ఎంపీపీ విజయలక్ష్మి, ఊశన్న, ఆంజనేయులు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నారాయణపేట రూరల్: జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. మంగళవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గణితం-ఏ, వృక్షశాస్త్రం, పొలిటికల్ సైన్స్ పరీక్ష జరిగింది. జిల్లావ్యాప్తంగా 3,597 మంది రెగ్యులర్ విద్యార్థులకుగాను 3,507 మంది హాజరుకాగా 90 మంది గైర్హాజరయ్యారు. అదే విధంగా ఒకేషనల్ విద్యార్థులు 545 మందికి గాను 528 మంది పరీక్ష రాయగా 17 మంది హాజరుకాలేదు. జిల్లా తనిఖీ బృందం అధికారులు దామరగిద్ద, మద్దూర్, నారాయణపేటలో పర్యటించగా, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఊట్కూర్, మరికల్, ధన్వాడ, సిట్టింగ్ స్క్వాడ్ మక్తల్, మాగనూర్ కేంద్రాలు పరిశీలించారు.

11న అప్రెంటిస్‌షిప్ మేళా

వనపర్తిటౌన్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు కల్వకుర్తి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్పీ లక్ష్మణస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులై ఆసక్తి కలిగిన అభ్యర్థులు https://apprenticeshipindia.org/ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకొని స్టడీ సర్టిఫికేట్స్‌తో హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్‌ఫోన్ నంబర్లు 94921 82944, 78931 22605 సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ సేవల్లో రీజియన్‌కు రెండోస్థానం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌లో ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించినందుకు మహబూబ్‌నగర్ రెండో ఉత్తమ రీజియన్‌గా నిలిచిందని ఆర్ఎం వి.శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదాయం, ఓఆర్‌తోపాటు ఇతర అంశాల్లో రీజియన్ మెరుగైన ఫలితాలు సాధించినందుకు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు రావడానికి కృషిచేసిన రీజియన్ అధికారులు, డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో పనిచేద్దామని కోరారు.

న్యూస్‌రీల్

నిబంధనలు తప్పనిసరి

- అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్



నారాయణపేట: ప్రభుత్వ నిబంధనలకు లోబడి వెంచర్లు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రం పరిసరాల్లోని లే-అవుట్ ఏర్పాటు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని వెంచర్లను తొలగించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సునీత ఉన్నారు.

'ప్రజాదీవెన'ను విజయవంతం చేయండి

మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: పాలమూరులో బుధవారం జరిగే ప్రజాదీవెన బహిరంగ సభను విజయవంతం చేయాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన విడుదల చేసి మాట్లాడారు. బహిరంగ సభకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరవుతారని.. నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రామలింగం, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు గణేశ్‌కుమార్, ఆనంద్‌గౌడ్, మందుల నరేందర్, కావలి తాయప్ప, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

జొన్న క్వింటా రూ.5,129

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో జొన్నలు క్వింటా గరిష్టంగా రూ.5,129, కనిష్టంగా రూ.3,809 ధర పలికాయి. పెసర క్వింటా రూ.8,655- రూ.8,175.. వేరుశనగ రూ.6,769- రూ.4,050, ఆలసందలు సరాసరి ధర రూ.7,879, ఎర్ర కందులు రూ.10,369, తెల్ల కందులు గరిష్టంగా రూ.10,729, కనిష్టంగా రూ.10,621 ధరలు లభించాయి.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని.. ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎన్ని సాధారణ కాన్పులు, ఎన్ని సిజేరియన్లు జరిగాయో వివరాలు అందజేయాలని, అలాగే స్కానింగ్ కేంద్రాల్లో ఇప్పటి వరకు ఎన్ని స్కానింగ్‌లు నిర్వహించారో తెలపాలని కోరారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. అంతకుముందు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. సౌభాగ్యలక్ష్మి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994 అమలుపై క్లుప్తంగా వివరించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శైలజ, మలేరియా అధికారి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి పొదుపు ప్రణాళిక రూపొందించాలి..

వాతావరణ మార్పులకు అనుగుణంగా నీటి పొదుపునకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రం సమీపంలోని స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో ఇండో జర్మన్ ద్వైపాక్షిక ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన ఒకరోజు వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణాభివృద్ధి, జలశక్తి మంత్రిత్వశాఖ అనుసంధానంతో రాష్ట్రంలోని నారాయణపేట, వికారాబాద్ జిల్లాలో రెండేళ్ల పాటు జల వనరుల అన్వేషణ, నీటిని పొదుపుగా వాడుకునే విధానాలతో ఈ ప్రాజెక్టు కొనసాగనుందన్నారు. జిల్లాలో నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితి.. వినియోగాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఉపాధి ఉద్యోగులు, సిబ్బందికి సూచించారు. అంతకుముందు ప్రాజెక్టు ప్రిన్సిపల్ సైంటిస్ట్ గోపీనాథ్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతతో భూగర్భ జలాలను పసిగట్టి వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. వాతావరణ మార్పులు, వర్షాభావం కారణంగా ప్రకృతి సిద్ధమైన జలాలు తగ్గిపోతున్నాయని.. వినియోగం పెరిగిందని.. ఇలాంటి పరిస్థితుల్లో జల వనరుల అన్వేషణ, నిర్వహణ ఎంతో అవసరమన్నారు. జీఐఎస్ హెడ్ నాగరాజు ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశాలను వివరించారు. తమిళనాడులోని తిరువనమలై, రామనాథపురం జిల్లాలో నీటి పొదుపును పాటిస్తూ ఏర్పాటు చేసిన హనీపార్క్, విలేజ్ ఫారెస్ట్, బ్యాంబు ట్రీ ప్లాంటేషన్, నర్సరీలతో పాటు జల నిర్వహణ, జలాల లభ్యతను తదితర విషయాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వర్క్‌షాపులో ప్రాజెక్టు రాష్ట్ర కో-ఆర్డినేటర్లు రామబ్రహ్మం, సంతోష్, డీఆర్డీఓ రాజేశ్వరి, ఏడీఏ హైమావతి, మైనింగ్‌శాఖ ఏడీ నగేశ్, డీపీఆర్‌ఓ రషీద్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పకడ్బందీగా 'పది' పరీక్షల నిర్వహణ

నారాయణపేట రూరల్: పదోతరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. స్థానిక ఆదర్శ బీఈడీ కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పదోతరగతి పరీక్ష కేంద్రాల సీఎస్, డీఓలతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 18 నుంచి పరీక్షకు ప్రారంభం కానున్నాయని.. కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు, గాలి, వెలుతురు వచ్చేలా గదుల ఏర్పాటు ఉండాలన్నారు. సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా లేదో సరిచూసుకోవాలని, ప్రశ్నాపత్రాలు నిఘా కెమెరాల ఎదుట తెరవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ గుర్తింపు కార్డు ధరించాలని, బయటి వ్యక్తులను లోనికి అనుమతించరాదన్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకురావద్దని.. తనిఖీలకు వచ్చే వారిని సైతం ఐడీ కార్డు ఉంటేనే లోపలికి అనుమతించాలన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని, ఇన్విజిలేషన్ విషయంలో ఒత్తిడులు ఉంటే తమ దృష్టికి తీసుకునిరావాలని, ఫిర్యాదులు వస్తే సహించేది హెచ్చరించారు. బందోబస్తుకు పోలీసుశాఖ సహకారం తీసుకోవాలన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు, ఇటీవల ఇంటర్ పరీక్షల్లో జరిగిన ఘటనలను తెలియచేస్తూ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డీఈఓ ఎండీ అబ్దుల్ ఘని, పరీక్షల విభాగం అధికారి రమేష్‌శెట్టి, సెక్టోరియల్ అధికారులు రాజేంద్రకుమార్, విద్యాసాగర్, శ్రీనివాస్, పద్మనళిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ప్రొఫైల్స్

మహబూబ్‌నగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి

పేరు: మన్నె శ్రీనివాస్‌రెడ్డి
(ఎంపీ మహబూబ్‌నగర్)
తండ్రి: అచ్చిరెడ్డి, తల్లి: సోమేశ్వరమ్మ
భార్యలు: గీతమ్మ, లక్ష్మమ్మ
విద్యార్హత: బీఏ
పుట్టిన తేది: 02-01-1959
స్వస్థలం: గురుకుంట, నవాబుపేట మండలం
సంతానం: ముగ్గురు కూతుళ్లు
రాజకీయ నేపథ్యం: ఎంఎస్‌ఎన్ ఫార్మకంపెనీ అధినేత మన్నె సత్యనారాయణరెడ్డి చిన్నతమ్ముడు శ్రీనివాస్‌రెడ్డి. ఈయన సైతం కంపెనీ వ్యవహారాలు చూసుకుంటున్నారు. 2019లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సూచనలతో రాజకీయ అరంగేట్రం చేసి, మొదటి ప్రయత్నంలోనే మహబూబ్‌నగర్ ఎంపీగా విజయం సాధించారు. అంతకు ముందు ఎంపీటీసీగా, సింగిల్‌విండో డైరెక్టర్‌గా కొనసాగిన శ్రీనివాస్‌రెడ్డి.. ఒకే సారి ఎంపీగా గెలుపొంది చరిత్ర సృష్టించారు. తాజాగా బీఆర్‌ఎస్ నుంచి రెండవ సారి ఎంపీగా పోటీచేసే అవకాశం లభించింది.

స్థానిక సంస్థల బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి

పేరు: ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
స్వస్థలం : అన్నాసాగర్, భూత్పూర్ మండలం
తల్లిదండ్రులు: ఆల రఘుపతిరెడ్డి, వరలక్ష్మి
భార్య : మంజుల
సంతానం: ఇద్దరు కుమార్తెలు
పుట్టినతేదీ : 30.09.1968
చదువు: బీఈ సివిల్ ఇంజినీర్
రాజకీయ నేపథ్యం: మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రఘుపతిరెడ్డి వారసత్వంతో 2002లో టీడీపీ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 2006లో భూత్పూర్ జెడ్పీటీసీగా గెలిచారు. 2009లో టీడీపీ రాజీనామా చేసి టీఆర్‌ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని నియోజకవర్గ ప్రజలను చైతన్యం చేశారు. 2014లో జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆల తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2018లో రెండోసారి గెలిచిన ఆయన 2023లో స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు.

స్థానిక సంస్థల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి

పేరు: మన్నె జీవన్‌రెడ్డి
తండ్రి: వెంకట్రాంరెడ్డి, తల్లి: నిర్మల
భార్య: స్వాతి
విద్యార్హత: ఎంబీఏ, బిజినెస్ మేనేజ్‌మెంట్ ఇన్ ఫారెన్ డిప్లొమా
పుట్టిన తేది: 19-12-1977
స్వస్థలం: గురుకుంట, నవాబుపేట మండలం
సంతానం: ఇద్దరు కుమారులు
విధులు: వైస్ ప్రెసిడెంట్, ఎంఎస్‌ఎన్ (ల్యాబ్) ఫార్మ కంపెనీస్ ప్రైవేటు లిమిటెడ్
రాజకీయ నేపథ్యం: ఎంఎస్‌ఎన్ ఫార్మకంపెనీ అధినేత సత్యనారాయణరెడ్డి సోదరుడు వెంకట్రాంరెడ్డి కుమారుడు జీవన్‌రెడ్డి. తన బాబాయ్ మన్నె శ్రీనివాస్‌రెడ్డి 2019లో ఎంపీగా పోటీ చేయగా.. అన్నీ తానై ఆయన గెలుపులో కీలకంగా వ్యవహరించారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్న సన్నిహితంతో కాంగ్రెస్ పార్టీలో చేరి, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచారు.

ప్రసాద్ స్కీం భవనం రెడీ



ప్రారంభోత్సవానికి సిద్ధమైన అలంపూర్‌లోని ప్రసాద్ స్కీం భవనం

- రేపు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్రమోదీ
- హాజరుకానున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్‌లో కేంద్ర పర్యాటక శాఖ నిర్మించిన ప్రసాద్ స్కీం భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ఈనెల 7న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కలెక్టర్ బీఎస్ సంతోష్‌తో పాటు రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు హాజరు కానున్నారు. 'స్వదేశీ దర్శన్'లో భాగంగా శ్రీనగర్ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రసాద్ స్కీం భవనాన్ని ప్రారంభించి, జాతికి అంకితం చేయనున్నారు. ఈమేరకు రాష్ట్ర అధికారులకు కేంద్ర పర్యాటక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. భవనంతో పాటు గార్డెన్, అన్నదాన సత్రం, సాంస్కృతిక మందిరం ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ డీఈ ధన్‌రాజ్ తెలిపారు. కాగా, మూడంతస్తుల భవనం నిర్మించగా.. గ్రౌండ్ ఫ్లోర్ పనులన్నీ పూర్తయ్యాయి. మిగతా భవనంలో చిన్నచిన్న పనులు పూర్తిచేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. ప్రసాద్ స్కీం భవన నిర్మాణానికి సుమారు రూ.38 కోట్లు మంజూరు కాగా.. రూ.28 కోట్ల పనులు పూర్తయినట్లు వివరించారు. ఆలయం నుంచి అప్రోచ్ రోడ్డు పనులను కూడా పూర్తిచేశారు. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ వర్చువల్‌గా అలంపూర్‌లో ప్రసాద్‌స్కీం భవనం ప్రారంభించడంతో పాటు వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి, బల్కంపేట ఎల్లమ్మ ఆలయం, భువనగిరి కోట ప్రాంతాల్లో ప్రసాద్ స్కీం కింద చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈమేరకు అలంపూర్‌లో పర్యాటక శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రసాద్ స్కీం భవన ప్రారంభోత్సవాన్ని తిలకించేందుకుగాను ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయనున్నారు.

నేటి మధ్యాహ్నం జోగుళాంబ దర్శనాలు నిలిపివేత

అలంపూర్ క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్న సందర్భంగా బుధవారం మధ్యాహ్నం కొంతసేపు జోగుళాంబదేవి దర్శనాలను నిలిపివేస్తున్నట్లు ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య, ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. అమ్మవారి ఆలయంలో బుధవారం ఉదయం 11నుంచి సాయంత్రం 4 గంటల వరకు అష్టబంధన ద్రవ్య సమర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అమ్మవారి విగ్రహం, పీఠానికి మధ్య ఉన్న ఖాళీలను అష్టబంధన ద్రవ్యంతో బిగించడం వల్ల యంత్రమునకు అభిషేక నీరు చేరకుండా కాపాడవచ్చన్నారు. ఈప్రక్రియను ఏకాంతంగా నిర్వహించనున్న సందర్భంగా అమ్మవారి ఆలయంలో భక్తులకు దర్శనాలను కొంతసేపు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ, పాలకమండలి సభ్యులు వెంకటేశ్వరరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, అర్చకులు వేముల విక్రాంత్ శర్మ, విద్యావాచస్పతి బ్రహ్మశ్రీ అవ్వారి శ్రీనివాస్ శాస్త్రి ఉన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఈఓ పురేందర్‌కుమార్

నవబ్రహ్మ ఆలయాల్లో వేద ఘోష

అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నవబ్రహ్మ ఆలయాలు వేద ఘోషతో మార్మోగుతున్నాయి. సోమవారం రాత్రి జోగుళాంబదేవికి వాస్తు పర్యగ్నీకరణ కార్యక్రమం నిర్వహించగా.. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు యాగశాలలో ఆవాహిత దేవతా హోమాలు, చండీ పారాయణాలు, చండీ హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 35 మంది రుత్వికులు మూడు బృందాలుగా ఏర్పడి రుద్ర పారాయణాలు, చండీ పారాయణాలు, వేద పారాయణాలు చేశారు. దీంతో నవబ్రహ్మ ఆలయాలన్నీ వేద మంత్రాలతో మార్మోగాయి. సాయంత్రం ప్రదోష కాలంలో దర్బార్ సేవలు, లలితా పారాయణాలు, బహుపారాక్‌లు పఠించారు. యాగశాలలో కొలువుదీరిన ఆవాహిత దేవతామూర్తులు, కలశాలకు దశవిధ హారతులు సమర్పించారు.



జోగుళాంబ ఆలయంలో వాస్తు పర్యగ్నీకరణ నిర్వహిస్తున్న అర్చకులు



అమ్మవారి కలశాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు

ఆలయంలో ప్రముఖులు..

జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామిని గద్వాల ఆర్డీఓ రాంచందర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వారికి ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఈఓ పురేందర్‌కుమార్ సాదర స్వాగతం పలికారు. కాగా, కర్నూల్‌కు చెందిన రమణారెడ్డి రూ.25 వేలు విలువజేసే ధ్యాన శ్లోకంతో కూడిన ఎలక్ట్రికల్ బోర్డు, మద్రాస్‌కు చెందిన భక్తుడు రూ.42 వేలు విలువజేసే ఇన్వర్టర్‌ను ఆలయానికి అందజేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో యాగ నిర్వాహకుడు విద్యావాచస్పతి అవ్వారి శ్రీనివాస్ శాస్త్రి పాల్గొన్నారు.

నల్లమలలో శివనామస్మరణ



శ్రీశైలంలో ఇరుముడి సమర్పిస్తున్న శివస్వాములు

- కాలినడకన మల్లన్న సన్నిధికి చేరుకుంటున్న భక్తులు
- రాత్రివేళ చలి, పగలు మండుటెండల్లో..
- రహదారి వెంట భక్తుల జనసంద్రం
- రాత్రివేళలోనూ నడక సాగిస్తున్న స్వాములు



వాహనాల్లో శ్రీశైలంలో బయలు దేరుతున్న శివస్వాములు

అచ్చంపేట: హరహర మహాదేవ శంభో శంకర.. ఓం నమః శివాయ.. శివాయ నమః ఓం.. అంటూ ఒంటి పూట భోజనం.. సాయంత్రం అల్పాహారం.. అందుబాటులోని శివాలయంలో పూజలు.. ఆధ్యాత్మిక ప్రసంగాలు.. ధ్యానముద్రలతో ఆధ్యాత్మిక ఆనందానికి లోనవుతున్నారు శివదీక్ష స్వాములు. పంచాక్షరి నామజపంతో ఆ మల్లికార్జునస్వామి శివదీక్షను స్వీకరిస్తే తమకున్న కష్టాలన్నీ తొలగిపోతాయని, కుటుంబమంతా ఆయురారోగ్యాలతో తులతూగుతుందని భావిస్తుంటారు. రవాణా సౌకర్యాలు ఉన్నా.. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో శివనామ సంకీర్తనలు చేసుకుంటూ కాలినడకన కొండలు, గుట్టలు, బండరాళ్లను, ముళ్లకంపలను అడ్డు తొలగించుకుంటూ శ్రీశైలం చేరుకుంటున్నారు. వందల కిలోమీటర్ల దూరం నుంచి మండుటెండలను లెక్కచేయకుండా, పుడమి తల్లి వేడికి పాదాలు బొబ్బలెక్కుతున్నా.. మదిలో ప్రతిధ్వనిస్తున్న శివనామస్మరణతో కైలాస ద్వారం చేరుతున్నామని చెబుతున్నారు. గతంలో ఈఓగా పనిచేసిన శంకరరెడ్డి శివదీక్షను 1996లో ప్రారంభించి విశేష ప్రాధాన్యతను పెంపొందించేలా కృషి చేశారు. పాదయాత్ర చేస్తున్న శివస్వాములు రాత్రి వేళ మూడు, నాలుగు గంటలు మాత్రమే నిద్రపోతున్నారు. అర్ధరాత్రి 2 గంటల తర్వాత తిరిగి నడక సాగిస్తున్నారు.

అటవీశాఖ నిబంధనలతో..

పాదయాత్రతో శ్రీశైల మహాక్షేత్రం వెళ్లే స్వాములకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకొచ్చి షామియానాలు, ఉచిత భోజన, మంచి నీటి సౌకర్యాలతో పాటు అల్పాహార వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. పాదయాత్రతో వచ్చిన శివ స్వాములకు నల్లమలదారిలోని మన్ననూర్, పర్హాబాద్, వటువర్లపల్లి, రాసమల్లబావి వద్ద 15ఏళ్లుగా దాతలు ముందుకు వస్తున్నారు. శివస్వాముల ఆకలి తీర్చడంలో దాతలు అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అచ్చంపేట–శ్రీశైలం నల్లమల అభయారణ్య మార్గంలో 20కి పైగా అన్నదాన కేంద్రాలు వెలిశాయి. మన్ననూర్ తర్వాత వటువర్లపల్లి వరకు ఎక్కడ కూడా వీరికి తాగేందుకు గుక్కెడు నీరు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. వటువర్లపల్లి తర్వాత మళ్లీ దోమలపెంట వరకు ఇదే పరిస్థితి ఉంటుంది. పాదయాత్ర చేసే స్వాములకు జంతువుల నుంచి ప్రాణహాని కలుగకుండా అటవీ మార్గంలో సిబ్బందితో టీం ఏర్పాటు చేసి రక్షణ కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధంపై స్వాములకు అవగాహన కల్పిస్తున్నారు.

ఆకలి తీరుస్తున్న నిత్యాన్నదాన సత్రాలు..

శ్రీశైలంలో 50కి పైగా నిత్యాన్నదాన సత్రాలు ఉన్నాయి. అన్నదాన సత్రాల్లో అన్నపూర్ణాదేవికి అర్చనలు చేస్తున్నారు. వాసవీ సత్రం, కొండవీటి రెడ్ల, మున్నూరుకాపు, వెలమ, విశ్వబ్రాహ్మణ, అన్నదాన, కమ్మ, కాకతీయ, కంబం, యాదవ, శ్రీకృష్ణదేవరాయ, ఆరెకటిక, మేరు సంఘం, వెలుమ, వందేళ్లనాటి కరివెన సత్రాలతో పాటు మరిన్ని సత్రాలు నిత్యాన్నదానాలు చేస్తున్నారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అటకేశ్వర సమీపంలోని నాలుగు ఆశ్రమాలు వేలాది మంది భక్తులకు అన్నదానం చేస్తున్నాయి. శ్రీశైలంలో ఒక్కరికి అన్నదానం చేస్తే కాశీలో లక్ష మందికి అన్నదానం చేసిన పుణ్యం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయనే నేపథ్యంలో అన్నం వితరణకు తామూ భాగస్వాములం అవుతున్నామని వేలాది మంది విశేషంగా అన్నసత్రాలకు విరాళాలు సమర్పిస్తున్నారు.

రామన్‌పాడులో 1,015 అడుగులు

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతుంది. మంగళవారం 1,015 అడుగులకు చేరింది. కొత్తపల్లి ఊకచెట్టు వాగు వంతెన కింద నీటి మట్టం తగ్గింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వార వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలియజేశారు.

తరలివచ్చిన భక్తజనం



జములమ్మ అమ్మవారు



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

గద్వాలన్యూటౌన్: జములమ్మ అమ్మవారి ఆలయానికి మంగళవారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. ఉమ్మడి జిల్లాతో పాటు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వేలాదిగా భక్తులు వచ్చారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. డప్పుల మోతలు, తప్పెట్ల సప్పుళ్లతో భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కోళ్లు, మేకపోతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సల్లగా చూడమ్మ జములమ్మ తల్లీ అంటూ భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

హోరాహోరీగా ఒంటెద్దు బండిలాగు పోటీలు



బండిలాగు పోటీలో తలపడుతున్న ఎద్దు

అయిజ: మండల కేంద్రంలో తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం అంతర్‌రాష్ట్ర స్థాయి ఒంటెద్దు బండి గిరుక లాగు పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 21 ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. మన్నాపురానికి చెందిన మాల తిమ్మన్న ఎద్దు 270.11 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ.20,000 కైవసం చేసుకుంది. అదేవిధంగా కర్నూలు జిల్లా బంగారు పేటకు చెందిన మద్దిలేటి ఎద్దు 198 అడుగుల దూరం లాగి 2వ బహుమతి రూ.15,000 గెలుచుకుంది. మన్నాపురానికి చెందిన కాశీం ఎద్దు 187.7 అడుగుల దూరం లాగి 3వ బహుమతి రూ.10,000 గెలుచుకుంది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. పోటీలను చూసేందుకు చుట్టుపక్కల మండలాల నుంచి ప్రజలు తరలివచ్చారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఐక్య పోరాటం



భారత రాజ్యాంగ పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న సంఘాల నాయకులు, సామాజిక వేత్తలు

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం కులమతాలకతీతంగా ఐక్యంగా పోరాడుదామని పలువురు ప్రజా సంఘాలు, సామాజిక వేత్తలు అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం– దేశాన్ని కాపాడుకుందాం' అనే అంశంపై సబ్బండవర్గాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సభలో సామాజిక వేత్తలు ప్రసంగిస్తూ దేశంలో ప్రజల మధ్య విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పదేళ్లలోనే రాజ్యాంగ పరిరక్షణ అనే అంశం ఎందుకు వచ్చిందో అర్థం చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. రాజ్యాంగం మనందరికీ సమానత్వపు హక్కు కల్పించిందని, కానీ, నేడు దేశంలో అలాంటి పరిస్థితులు కనిపించడం లేదన్నారు. దేశంలో 90 శాతం సంపద 10 శాతం మంది వద్ద ఉందని, ఈ దేశాన్ని పదిమంది పెట్టుబడిదారులే పాలిస్తున్నారన్నారు. ప్రజా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ దేశంలో ఎన్‌ఆర్‌సీ, సీఏఏ, యూసీసీ విరమించాలని, మతం ఆధారం కాకుండా డీఎన్‌ఏ ఆధారంగా పౌరసత్వం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. బలహీన వర్గాలన్నీ ఏకమై పోరాటం చేస్తే రాజ్యాంగాన్ని కాపాడుకోవచ్చని పిలుపునిచ్చారు. సమావేశంలో సియాసిత్ ఎడిటర్ అమీర్‌అలీఖాన్, ప్రొఫెసర్ చింతకింది కాశీం, జమియతుల్ ఉలేమా, హాఫిజ్ ఖాలిక్ పీర్ అహ్మద్ సాబ్రి, టీఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు కాచం సత్యనారాయణ, బామ్‌సెఫ్ నాయకులు దాసురాంనాయక్, విశ్వజన కళామండలి అధ్యక్షులు మాస్టర్జీ, రైతు స్వరాజ్య వేదిక కన్నెగంటి రవి, కిరణ్‌కుమార్ విస్రా, ప్రజా సంఘాల నాయకులు ఎస్‌ఎం ఖలీల్, హనీఫ్ అహ్మద్, వన్నాడ అంజన్న, రవినాయక్, సుధాకర్, సుందర్‌పాల్, షాఫైసల్, ఖవి, సిరాజుద్దీన్, రహెమాన్ సోఫి, శ్రీనివాసరావు, అబ్దుల్లా, హాజీ సలీం, ఇస్మాయిల్, నయీముల్లా షరీఫ్, అజీజ్, గోపాల్, మజీద్, భూషణ్, లక్ష్మయ్య, జబ్బార్ పాల్గొన్నారు.

బీసీ నాయకులను అభ్యర్థిగా ప్రకటించాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎంపీ టికెట్‌ను బీజేపీ డీకే అరుణకు ఇవ్వవద్దని తెలంగాణ బీసీ కులాల సమన్వయ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గద్వాల అసెంబ్లీలో బీజేపీ బీసీ అభ్యర్థికి టికెట్ ఇస్తే.. సొంత పార్టీ అభ్యర్థిని కాదని అల్లుడిని గెలిపించుకుందని ఆరోపించారు. తన సామ్రాజ్యంలో బీసీని రాజకీయంగా ఎదగనివ్వకుండా ద్రోహం చేస్తుందని మండిపడ్డారు. వ్యక్తి గత ఎజెండాల కోసం పని చేయవద్దని మోదీ చెబుతుంటే అందుకు భిన్నంగా తమ సామ్రాజ్యాన్ని విస్తరిస్తుందని దుయ్యబట్టారు. ఆమె సొంత ఎదుగుదల కోసం పనిచేశారే తప్ప పార్టీ మనుగడ కోసం కాదని ఎద్దేవా చేశారు. ఇలాంటి నాయకులకు బీజేపీ ప్రోత్సాహం మంచిది కాదని, అందుకే ఆమెకు టికెట్ ఇవ్వవద్దని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాకు లేఖ రాస్తామన్నారు. అందరినీ కలుపుకొని ముందుకెళ్లే బీసీ నాయకులను అభ్యర్థిగా ప్రకటించేలా రాష్ట్ర నాయకత్వం కృషిచేయాలని కోరారు. సమావేశంలో నాయకులు చంద్రశేఖర్, రజనికాంత్, చందు, మల్లేష్ పాల్గొన్నారు.

కొత్తకోట యువకుడి ఆత్మహత్య



శ్రీనివాసులు గౌడ్ (ఫైల్)

కొత్తకోట రూరల్: హైదరాబాద్‌లో కొత్తకోట యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొత్తకోటలోని రామాలయం వీధికి చెందిన గండు సుధా, గండు భాస్కర్‌గౌడ్‌లకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు గండు శ్రీనివాసులుగౌడ్(26) డిగ్రీ పూర్తి చేసి ఏడాది కాలంగా హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో ఓ ప్రైవేట్ హాస్టల్ ఉంటూ జోమాటో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం అతని స్నేహితులు తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వెంటనే తల్లిదండ్రులు, బంధువులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఆర్థిక ఇబ్బందులా? ఇంకేమైనా కారణాలున్నాయా? అని కాలనీవాసులు చర్చించుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



జంగారెడ్డి(ఫైల్)

మిడ్జిల్: మండల పరిధిలోని బోయిన్‌పల్లి గ్రామ శివారులో మంగళవారం మోటార్ సైకిల్‌ను కారు ఢీకొట్టిన సంఘటనలో ఊర్కొండ మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ నిర్మలమ్మ భర్త జంగారెడ్డి(58) మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఊర్కొండకు చెందిన జంగారెడ్డి తన సొంత పనిమీద మిడ్జిల్‌కు వచ్చి తిరిగి మోటార్‌సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. బోయిన్‌పల్లి సమీపంలో జడ్చర్ల– కల్వకుర్తి ప్రధాన రహదారిపై కల్వకుర్తి నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న ఏపీ11 ఏడీ 8778 నంబరు కారు ఢీట్టింది. దీంతో జంగారెడ్డి అక్కడికక్కడే మృతిచెందిన్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడి కుమారుడు ప్రవీణ్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించిన్నట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలియజేశారు. కాగా, జంగారెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

క్లుప్తంగా

కంపెనీ ఏర్పాటు చేయొద్దు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దివిటిపల్లిలోని ఐటీ టవర్‌లో లిథియం అయాన్ గిగా (అమరరాజా బ్యాటరీ కంపెనీ) ను ఏర్పాటు చేయొద్దని అఖిలపక్ష నాయకులు కలెక్టర్ రవి నాయక్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు మంగళవారం సాయంత్రం ఆయనను కలెక్టరేట్‌లో కలిసి విన్నవించారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఉప ఎన్నికలు ఉన్నందున ఆ తర్వాత పరిశ్రమ వద్దకు వెళ్లి విచారణ జరిపి తగు నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. కాగా, ఈనెల 4న ఈ పరిశ్రమ ఎదుట దివిటిపల్లి, అంబటిపల్లి, ఎదిర, సిద్దాయపల్లికి చెందిన సుమారు 150 మంది ధర్నా చేసిన విషయం విదితమే. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

గట్టు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక పట్ల అదే గ్రామానికి చెందిన 55 ఏళ్ల వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించడంతో పోక్సో కేసు నమోదైంది. మైనర్ బాలిక పట్ల సదరు వ్యక్తి అభ్యంతరకరంగా ప్రవర్తించడంతో సదరు మైనర్ బాలికల కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని తెలియజేసింది. దీంతో కుటుంబ సభ్యుల మైనర్ బాలికతో కలిసి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.